## క్లుప్తంగా

### సాహితీమూర్తులకు నివాళులు

ఆకివీడు: సాహిత్యం ద్వారా ప్రజా చైతన్యం వెల్లివిరుస్తోందని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత చెప్పారు. ప్రముఖ సాహితీ మూర్తులు గురజాడ అప్పారావు, గుర్రం జాషువల సాహిత్యంపై సోమవారం కళాశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజంలో రుగ్మతల్ని తన రచనలు, సాహిత్యం ద్వారా చైతన్యపరచిన మహోన్నత వ్యక్తులని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు ఓగేశ్వరరావు, అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మ సేవలో చినమిల్లి



అమ్మవారిని దర్శించుకున్న పార్టీ నియోజకవర్గ చినిమిల్లి వెంకటరాయుడు

భీమవరం అర్బన్: మండలంలోని కనకదుర్గమ్మ అమ్మవారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చినిమిల్లి వెంకటరాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో పంచదార వీధిలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### రైస్‌మిల్ తనిఖీ

భీమవరం: సత్య సాయి దుర్గ ట్రేడర్స్ రైస్ మిల్లును జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పట్టణంలో సత్య సాయి ట్రేడర్స్ రైస్ మిల్లును సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైస్ మిల్లులో గోనెసంచులను పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంచులు యొక్క నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిరిగి ఉన్న సంచులను వెంటనే కుట్టించాలని మిల్లరును ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు ఎండి ఇబ్రహీం, డీఎస్‌ఓ ఎన్.సరోజ, ఏ ఎస్ ఓ ఎం.రవి శంకర్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

### గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

భీమవరం అర్బన్: గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ భీమవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. బబలరామరాజు హెచ్చరించారు. భీమవరం మండలంలోని బేతపూడి గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న బండి చిట్టిబాబుపై ఎక్సైజ్ శాఖ సిబ్బంది సోమవారం దాడి చేసి అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో పాల్గొన్న ఎస్సై ఉమామహేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ మెంబర్‌గా సకుమల్ల

భీమవరం: రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సభ్యుడిగా భీమవరం పట్టణంలోని సీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ సకుమల్ల సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎస్ ప్రసన్నశ్రీ ఉత్తర్వులు జారీ చేసినట్లు సత్యనారాయణ సోమవారం విలేకర్లకు తెలిపారు. ఈసందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చిడే సత్యనారాయణ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కళాశాల అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు(రత్నం), కోశాధికారి వడుపు గోపి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎండి సలీమ్ ఖాన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

### ఘనంగా విజయీభవ శోభాయాత్ర

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో దసరా విజయీభవ పండుగ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దసరా విజయీభవ శోభాయాత్రను ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, వన్ టౌన్ సిఐ నాగరాజు, మావుళ్లమ్మ ఆలయ ఈవో బుద్దా మహాలక్ష్మి నగేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలన్నారు. సీఐ నాగరాజు, ఆలయ ఈవో మహాలక్ష్మి నగేష్ మాట్లాడుతూ కనుమరుగైపోతున్న ఈ సంప్రదాయాలను 36 ఏళ్లుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, బోండా వెంకట సుబ్బారావు, అరసవల్లి సుబ్రమణ్యం, నందమూరి రాజేష్, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కే శిరీష, టివివి ప్రసాద్, గంధం శ్రీదేవి, పిప్పళ్ల ప్రసాద్, పుప్పాల శేషు, రూపవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

- భక్తిశ్రద్ధలతో పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



పంచారామక్షేత్రంలో మహాలక్ష్మీదేవిగా పార్వతి దేవి



బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో శ్రీ వాసవికన్యకపరమేశ్వరీ అమ్మవారు



ఉండి శివాలయంలో బాల త్రిపురా సుందరిగా అలంకరించిన మహిషాసుర మర్దిని అమ్మవారు



కాళ్ళకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదిలక్ష్మి అలంకరణ



బాలా త్రిపురసుందరీగా భక్తులకు దర్శనమిచ్చిన పెద్దింటి అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో దేవీశరన్నవరాత్రులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా, శ్రీసువర్ణ రజిత కవచాలంకారణలో భక్తులకు దర్శనమిచ్చారు. మావుళ్లమ్మ అమ్మవారిని సోమవారం శ్రీసువర్ణ రజిత కవచాలంకారణలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ సహయ కమిషనర్ బుద్దా మహలక్ష్మీ నగేష్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

**మహలక్ష్మీ దేవీగా...**

పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థనంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పార్వతిదేవి మహలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.కృష్ణంరాజు, ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

**బాలా త్రిపుర సుందరీదేవిగా...**

భీమవరం త్యాగరాజు భవనంలో కొలువైన శ్రీ వాసవికన్యకపరమేశ్వరీ అమ్మవారు సోమవారం బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**బాలాత్రిపుర సుందరీదేవిగా...**

ఉండి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా పలు ప్రాంతాల్లోనూ, ఆలయాల్లో ప్రారంభించారు. మొదటి రోజు అమ్మవారిని బాలా త్రిపురా సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహిషాసుర మర్ధిని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు.

**ఘనంగా దసరా ఉత్సవాలు**

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం, మండలంలో పలు గ్రామాల్లో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అమ్మవారి కలశ స్థాపన, శ్రీ చక్ర అభిషేకం చేసి అమ్మవారిని మొదటి రోజు ఆదిలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.

**గ్రామాల్లో విశేష పూజలు**

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలోనూ, గ్రామాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో సోమవారం ప్రారంభించారు. అమ్మవారిని బాలా త్రిపుర సందరీగా అలంకరించి పూజించారు. స్థానిక పెద్దింటి అమ్మవారిని బాలా త్రిపుర సందరీగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు, హోమం నిర్వహించారు. స్థానిక దుంపగడప రైల్వే గేటు వద్ద కనక దుర్గమ్మ ఆలయం వద్ద ప్రత్యేక విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శాంతినగర్‌లోని నూకాలమ్మ ఆలయం వద్ద దేవీశరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. మాదివాడ, సంతపేట, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో అమ్మవారి ప్రత్యేక విగ్రహాలు ఏర్పాటు చేసి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

### భక్తిశ్రద్ధలతో పూజలు



దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

వీరవాసరం: దసరా ఉత్సవాల సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామ ప్రధాన కూడళ్లలో కనకదుర్గమ్మ విగ్రహాలను నెలకొల్పారు. ఉదయం, సాయంత్రం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. వీరవాసంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలోనూ, తోలేరులో శ్రీ ప్రసన్న కనకదుర్గాదేవి ఆలయంలోనూ, రాయకుదురు, కొనితివాడ, మడుగు పోలవరం, అండలూరు, చింతలకోటి గరువు, మత్స్యపురిపాలెం, మత్స్యపురి, బాలేపల్లి, మెంటేపూడి, దూసనపూడి, పెరికిపాలెం తదితర గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శమనిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో అనంతం రంగారావు -పద్మావతి దంపతులు ,రాయిపల్లి వెంకటేశ్వరరావు దంపతులు, కొడమంచిలి ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

### యండగండి గ్రంథాలయాన్ని పూర్తి స్థాయిలో తెరవాలి

ఉండి: మండలంలోని యండగండి శాఖా గ్రంథాలయాన్ని పూర్తి స్థాయిలో తెరవాలని ఆ ప్రాంత పాఠకులు మొరపెట్టుకుంటున్నారు. శాఖా గ్రంథాలయంలో పనిచేసే లైబ్రేరియన్‌ను బదిలీ చేయడంతో ఆ పోస్టు ఖాళీ అయిందని, దాని స్థానంలో గొల్లలకోడేరు గ్రంథాలయాధికారి ఇన్‌చార్జిగా నియమించారన్నారు. దీనివల్ల వారానికి ఒక రోజు మాత్రమే గంథాలయాన్ని తెరుస్తున్నారని చదువరులు వాపోతున్నారు. ప్రతి రోజూ దినచర్యగా వార్తా పత్రికలు, పుస్తకాలు, విలువైన గ్రంథాలు చదివే పాఠకులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుందని, నిరుత్సాహం చెందుతున్నారని పలువురు జిల్లా గ్రంథాలయ అధికారికి రాతపూర్వకరంగా వినతి పత్రం అందజేశారు.


### వీరవాసరం రైతు సంఘం అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

వీరవాసరం: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వీరవాసరం మండల 5 వ మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 10 మందితో మండల నూతన కమిటీ ఎన్నికైంది. మండల అధ్యక్షుడిగా బాలం విజయకుమార్, కార్యదర్శిగా తాళ్లూరి హరిహర లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా బొర్రా అల మహారాజు, మరో ఉపాధ్యక్షుడిగా నేపాల సీతన్నను ఎన్నుకున్నారు.

# వరదల్ని తలపించిన కుంభవృష్టి వర్షం



మసీదు వద్ద జలమయమైన రహదారిలో ఆగిపోయిన స్కూటర్‌ను నడిపించుకు వెళ్తున్న ప్రయాణికులు



స్థానిక సంత పేట, సంగీత్ థియేటర్ వద్ద జలమయమైన రోడ్లు

ఆకివీడు: వరదల్ని తలపించే విధంగా కుంభవృష్టి వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత మూడున్నర నెలల్లో వర్షాకాలంలో భారీ వర్షం కురవడం ఇదే ప్రథమమని చెబుతున్నారు. ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలోని ఆకివీడు, ఉండి, కాళ్ల, పాలకోడేరు మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. పలు చోట్ల మూడు అడుగులకు పైగనే నీరు నిలబడిపోయి ఉంది. ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులు, పిడుగుపాటులతో ఆకాశం దద్దరిల్లింది. ఉక్కబోత వాతావరణానికి అకాల వర్షంతోడవ్వడంతో వ్యాధులు విజృంభించే ప్రమాదం ఏర్పడిందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వరి చేలల్లోకి భారీగా నీరు చొచ్చుకువెళ్లింది. వరి మొక్కలు కుదుళ్లు వేసుకునే సమయంలో భారీగా నీరు నిలబడటంతో కుదుళ్లకు ఇబ్బంది ఏర్పడుతుందంటున్నారు. నియోజకవర్గంలో 314.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు అయింది.

**నగర పంచాయతీని ముంచెత్తిన వాన**

ఆకివీడు నగర పంచాయతీని భారీ వర్షం ముంచెత్తింది. పట్టణంలోని పలు వార్డుల్లోని వీధులు జలమయమయ్యాయి. ఇటీవల డ్రెయినేజీలలోని మట్టిని భారీగా తొలగించడంతో ముంపునీరు తెల్లవారేసరికి బయటకు చొచ్చుకుపోయింది. ఆదివారం రాత్రి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లిన జనం తిరిగి ఇంటికి చేరుకునే సమయంలో భారీ వర్షం కురవడంతో రోడ్లు నీట మునగడంతో భయాందోళనకు గురయ్యారు. వాహనాలు ముంపునీటిలో నుంచి వెళ్లలేకపోయాయి.

| నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షం(మి.మీ): | |
|---|---|
| ఆకివీడు | 70.8 మి.మీ. |
| ఉండి | 117.2 మి.మీ. |
| పాలకోడేరు | 60.0 |
| కాళ్ల | 66.6 |

### చినమిల్లి పరామర్శ



పరామర్శిస్తున్న చినమిల్లి వెంకటరాయుడు

వీరవాసరం: మండలం చింతలకోటి గరువు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సొసైటీ చైర్మన్ కటికిరెడ్డి రాంబాబును భీమవరం వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ చినమిల్లి వెంకటరాయడు సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవ్వాకుల సత్యనారాయణ మూర్తి, దాసరి మాణిక్యాలరావు, కె. శ్రీనివాస్, కె. సత్యనారాయణ, దాసరి తాతాజి తదితరులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకోడేరు: మండలం విస్సాకోడేర గ్రామపంచాయతీ వద్ద స్వస్థ నారి సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులైన బిపి, సుగర్, క్యాన్సర్ మొదలైన వాటికి పరీక్షలతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఈ శిబిరాలలో అందజేస్తామని, రక్తహీనత ఉన్నవారికి పోషకాహారంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హషిత, ఉపసర్పంచ్ నాగరాజు, కూటమి నాయకులు అప్పారావు, నాగలక్ష్మి, బాలాజీ వర్మ తదితరులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

భీమవరం: భీమవరం పట్టణం 32వ వార్డులోని చెట్టుకింద సాయిబాబా గుడి వద్ద పేకాడుతున్న 7గురిపై కేసు నమోదు చేసినట్లు టుటౌన్ ఎస్ఐ కె రామరావు చెప్పారు. సోమవారం పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి 7గురిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ. 9,140 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

# ఇంజనీరంటే కోడింగ్ మాత్రమే కాదు



భీమవరం డీఎన్నార్ కళాశాలలో హ్యాకథాన్ కార్యక్రమం ప్రారంభించిన దృశ్యం

భీమవరం: ఇంజనీరంటే కేవలం కోడింగ్ చేయడం కాదని సమస్యను విభిన్న కోణాల్లో ఆలోచించి దానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఉండే పరిష్కారం కనుగొనడమని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఐడీఎల్ ల్యాబ్ హెడ్ నూకల గోపాలకృష్ణమూర్తి అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే ఇంటర్ నేషనల్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ హాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యువ ఇంజనీర్లలో సృజనాత్మక ఆలోచనలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడానికి హాకథాన్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ జి సత్యనారాయణ రాజు (బాబు) మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానం సరిపోదని కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం అంజన్‌కుమార్, ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ ఎస్ రవిచంద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కెఎల్‌ఎవి హర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిష్కార వేదికకు ఐదు ఫిర్యాదులు



ఆక్రమణల చెరలో స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని బంగారు కోడు పంట కాల్వ

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికకు ఐదు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు సోమవారం చెప్పారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని రెండవ వార్డు జానకీ నగర్‌లో రోడ్లు, డ్రైయిన్లు నిర్మించాలని, నాలుగు నెలలుగా వీధి దీపాలు వెలగడంలేదని ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఓల్డ్ వయ్యేరు పంట కాల్వ నుంచి ధర్మాపురం ఆయుకట్టుకు, మంచినీటి చెరువుకు బంగారు కోడు పంట కాల్వ ద్వారా నీరు సరఫరా అవుతోందని, అయితే కాలువకు ఇరువైపులా ఆక్రమణలతో కుంచించుకపోయిందని, చెరువుల కలుషిత నీటిని పంట కాల్వలోకి వదిలివేయడం వల్ల మంచినీటి చెరువు కలుషితమవుతోందని స్థానిక నగర పంచాయతీ 15వ వార్డు కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చినకాపవరం గ్రామంలో తనకు చెందని భూమిని వెబ్‌ల్యాండ్‌లో ఇతరుల పేరుతో నమోదు అయిందని, రికార్డుల ప్రకారం తన పేరున నమోదు చేయాలని అల్లూరి తమ్మిరాజు ఫిర్యాదు చేశారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలో తన భూమి నెం.8-1లో సర్వే చేయించి, గత మూడు సంవత్సరాలుగా పన్నులు చెల్లిస్తున్నా బకాయి చూపిస్తున్నారని గ్రామానికి చెందిన దండు సుందరి ఫిర్యాదు చేశారు. స్థానిక జానకమ్మ ఆసుపత్రి ప్రాంగణంలో ఆక్రమణల్ని తొలగించాలని, జాతీయ రహదారికి చేర్చి ఉన్న ఆక్రమణల వల్ల ఆసుపత్రికి వచ్చేవారికి ఇబ్బంది ఏర్పడుతుందని ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ జీ.డేవిడ్ లివింగ్ స్టన్ ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

# లేబర్ కోడ్లు రద్దును నిరసిస్తూ ఆందోళన




భీమవరంలో ఆందోళన చేస్తున్న మునిసిపల్ వర్కర్స్, ఎఐటీయూసీ నాయకులు

భీమవరం: కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చేసి పాలకులు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఎఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు హెచ్చరించారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం భీమవరంలో కార్మికులు బ్లాక్ డే పాటించి ప్రకాశంచౌక్ సెంటర్లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు, రంగారావు మాట్లాడుతూ బ్రిటిష్ హయాంలోనే ఎన్నో పోరాటాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించుకున్నామని కార్పొరేట్ శక్తులకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం వాటిని నాలుగు కోడ్స్‌గా మార్చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, దేశంలో కార్మిక సంస్కరణలను చర్చించడానికి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలాపు శ్రీను, రెల్ల రాము, బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మిస్టర్ ఆంధ్ర చాంపియన్‌గా విక్రమ్‌కుమార్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో న్యూ ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్, ఫిజిక్ మోడలింగ్ పోటీల్లో విశాఖపట్టణానికి చెందిన పి విక్రమ్‌కుమార్ మిస్టర్ ఆంధ్రగా ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్‌గా నిలిచి ట్రోఫీతో పాటు మోటార్ బైక్‌ను గెల్చుకున్నారు. ఆదివారం రాత్రి స్థానిక శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక కేంద్రంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పోటీలను ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో విజేతలకు, బహుమతులుగా మోటార్ బైకులను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డీఎస్ రాజు, షేక్ ఖాసిం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ దాసి వరప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బండారు వినోద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులకండం కోటేశ్వరరావు, మెంటే పార్ధసారధి, మానవతా సంస్థ చైర్మన్ బుద్దరాజ వెంకటపతి రాజు, చింతలపాటి రామకృష్ణరాజు, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో మంచి ఫలితాలు



ఆన్‌లైన్ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

భీమవరం: విద్యుత్ ఉత్పత్తి రంగంలో సోలార్ పవర్ కూడా ఆశించిన ఫలితాలు అందిస్తున్న తరుణంలో దాని ఉత్పత్తిని అంచనా వేసేందుకు ఆర్టిఫిషియల్ ఎంతగానో ద్వాదపడుతుందని ఎన్ఐటి వరంగల్ డాక్టర్ రవికుమార్ జతోత్ పేర్కొన్నారు. భీమవరం ఎస్ ఆర్ కార్ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వారం రోజులు పాటు ఆన్‌లైన్‌లో రోల్ ఆఫ్ ఏఐ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్ టెక్నిక్స్ ఇన్ పవర్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్ జరిగే ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. కార్యక్రమానికి ట్రిబుల్ ఈ ఈ హెడ్ డాక్టర్ బి ఆర్ కే వర్మ అధ్యక్షత వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజులు ఉన్నారు.

# పాత బస్టాండ్‌లో నూతన ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): చేకూరి రామబద్రిరాజు దాతృత్వంతో భీమవరం పాత బస్టాండ్ సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించినట్లు అయిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. చేకూరి రామబద్రిరాజు, పార్వతి దంపతుల ఆర్థిక సహకారముతో భీమవరం పాత బస్టాండ్ ప్రాంగణంలో రూ.55 లక్షల వ్యయంతో నిర్మించబడిన నూతన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త మంతెన వెంకట సత్యనారాయణ రాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.